## మహిళను ఇంట్లో బంధించిన దాయాదులు

రఘునాథపెల్లి, నవంబర్ 24 : భూ సమస్యలతో ఓ మహిళను దాయాదులు ఇంట్లో బంధించిన ఘటన జనగామ జిల్లా రఘునాథపెల్లి మండలం కోమల్లలో ఆదివారం జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. కోమల్లకు చెందిన పేరబోయిన రాజుకు తమ దాయాదులైన పేరబోయిన కొమురయ్యతో భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజు వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లగా, అతడి భార్య భాగ్యలక్ష్మి ఇంట్లో పనులు చేసుకుంటున్నది. ఇదేఅదును భావించిన కొమురయ్య మరో ఐదుగురితో వచ్చి ఆమె ఇంట్లోఉండగానే ఇరువైపులా ఉన్న తలుపులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో ఆందోళన చెందిన భాగ్యలక్ష్మి పోలీసులకు ఫోన్ చేయగా, వారు వచ్చి తలుపులు తీయించారు. కొమురయ్యతోపాటు ఆయనతో వచ్చిన ఐదుగురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఇంట్లో ఉన్న రాజు భార్య భాగ్యలక్ష్మి



రాజు ఇంటికి తాళం వేసిన దాయాదులు

## 'కేసీఆర్' సినిమా అద్భుతంగా ఉంది

- ఉద్యమ స్మృతులు గుర్తుకువచ్చాయి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్/పరకాల, నవంబర్ 24 : జబర్దస్త్ నటుడు రాకింగ్ రాకేశ్ నటించి, నిర్మించిన కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్) సినిమా అద్భుతంగా ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం ఆయన సినీహీరో రాకేశ్, దర్శకుడు అంజీ, చిత్ర యూనిట్, పార్టీ శ్రేణులతో కలిసి నగరంలోని రామ్‌లక్ష్మణ్ థియేటర్‌లో కేసీఆర్ సినిమాను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సినిమా చూస్తున్నంత సేపు ఉద్యమం నాటి స్మృతులు గుర్తుకు వచ్చాయన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ నర్సంపేటలో జరిగిన పెళ్లికి వచ్చిన ఘటన తాను, పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇప్పటికీ మర్చిపోలేమన్నారు. కేసీఆర్‌కు, తెలంగాణకు పేగుబంధం ఉందన్నారు. రాకేశ్ నిర్మించిన కేసీఆర్ సినిమా అద్భుత విజయం సాధించాలని ఆకాంక్షించారు. ప్రేక్షకులు ఆదరణ తప్పకుండా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చరణ్ అర్జున్ అందించిన సంగీతం వీనులవిందుగా ఉందన్నారు. గోరటి వెంకన్న, ఇతరుల గాత్రం పాటలకు ప్రాణం పోసిందన్నారు. సినిమాను అద్భుతంగా తీసిన చిత్ర యూనిట్‌ను అభినందించి సన్మానించారు.

**భద్రకాళీ ఆలయంలో పూజలు**

కేసీఆర్ చిత్ర యూనిట్‌తో కలిసి దాస్యం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. సినిమా హీరో రాకేశ్, చిత్ర దర్శకుడు అంజీ, చిత్ర నటీనటులతో కలిసి భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కేసీఆర్ సినిమా అద్భుతమని బీఆర్ఎస్ పరకాల మండల సమన్వయ కమిటీ సభ్యుడు ఆముదాలపల్లి అశోక్ అన్నారు. హనుమకొండలోని దాస్యం నివాసంలో రాకేశ్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల్లో కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి చెందిన తీరును కండ్లకు కట్టినట్లు చూపించారన్నారు. కార్యక్రమంలో పల్లెబోయిన రాజు, బుర్రి వెంకటేశ్, పుట్ట చంద్రమౌళి, వడ్ల మధు, పుట్ట నర్సింహ రాములు పాల్గొన్నారు.



సినీహీరో రాకేశ్‌తో కలిసి కేసీఆర్ సినిమా తిలకిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్

## రోడ్డు ప్రమాదంలో జాగృతి నేత రాంబాబు మృతి

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి

లింగాలఘనపురం, నవంబర్ 24 : హైదరాబాద్- హనుమకొండ జాతీయ రహదారిపై యశ్వంతాపూర్ సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు రంగు రాంబాబు మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. రఘునాథపల్లి మండలం గబ్బెటకు చెందిన రంగు రాంబాబుగౌడ్ (30) తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా నాయకుడిగా కొనసాగుతున్నారు. ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు సరఫరా చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి జనగామ నుంచి గబ్బెటకు బైక్‌పై వెళ్తుండగా యశ్వంతాపూర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో లింగాలఘనపురం, రఘునాథపల్లి మండలాల్లో విషాదం నెలకొంది.



కల్వకుంట్ల కవితతో రాంబాబు (ఫైల్)

**ఎమ్మెల్సీ కవిత దిగ్భ్రాంతి**

జనగామ, (నమస్తే తెలంగాణ) : రాంబాబు మృతిపై ఎమ్మెల్సీ, జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించిన కవిత వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పినట్లు తెలిపారు. సంతాపం ప్రకటించిన వారిలో జాగృతి జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి, జిల్లా నాయకులు ఎడ్ల దుర్గాప్రసాద్, కావేరి వినయ్, నవీన్, కిరణ్, యాకూబ్‌పాషా, అతిక్‌పాషా ఉన్నారు.

## జనగామలో ట్రా'ఫికర్'



బ్యాంకు ఎదుట వాహనాల పార్కింగ్

- అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- షాపుల ఎదుట బారులు
- అస్తవ్యస్త ట్రాఫిక్‌తో ప్రజలకు తప్పని తిప్పలు

జనగామ పట్టణం జిల్లా కేంద్రంగా మారడంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. సిద్దిపేట-సూర్యాపేట, వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాత్రింబవళ్లు వందలాది వాహనాల రాకపోకలతో నిత్యం చౌరస్తా రద్దీగా ఉంటుంది. చౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థ ఉన్నా కరెంట్ లేనప్పుడు వాహనాల రాకపోకలు అడ్డదిడ్డంగా సాగుతుంటాయి. ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరించాల్సి ఉన్నా ఆ వైపు దృష్టి పెట్టడంలేదు. పైగా దుకాణా యజమానులు, నిర్వాహకులు తమ షాపుల ముందున్న ఫుట్‌పాత్‌లను చిల్లర వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ట్రాఫిక్ కష్టాలకు కారణవుతున్నది. బ్యాంకులు, వైన్స్, బార్లు, హోటళ్లు, వస్త్ర, వాణిజ్య దుకాణాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఆ షాపుల ఎదుట వాహనాలు బారులు తీరి కనిపిస్తున్నాయి.

**రోడ్డుపై అడ్డాలకు కిరాయి వసూలు..**

వ్యాపారులు తమ దుకాణం ముందున్న స్థలాన్ని వాడుకునే కూరగాయలు, పండ్లు, పూలు అమ్మే చిరు వ్యాపారుల వద్ద రోజు లేదా నెలకు ఇంత అని డబ్బులు తీసుకుంటున్నారు. ఇవ్వని వారికి తమ దుకాణానికి అడ్డుగా ఉన్నారనే నెపంతో బలవంతంగా తీయించడం, లేదా గొడవకు దిగడం చేస్తుంటారు. ఇక దుకాణానికి వచ్చే వారు వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం చౌరస్తా నుంచి నెహ్రూ పార్కు రోడ్డులో కిరాణా షాపుల ముందు(డ్రైనేజీపై) పెట్టిన చిరు వ్యాపారుల సామగ్రిని పోలీసులు తీసుకెళ్లారు. స్టేషన్ చుట్టూ తిప్పించుకొని ఆ తర్వాత తీసుకోండని చెప్పడంతో సగం సరుకు మాయమైంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే అక్కడికక్కడే జరిమానా విధించాల్సిన పోలీసులు రోడ్డుపై పెట్టిన సామగ్రిని తీసుకెళ్లి తిరిగి ఇవ్వకుండా సతాయిస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో చాలా మంది ఫుట్‌పాత్‌లు, నాలాలను ఆక్రమించుకొని ఆ స్థలాలపై సామగ్రి అమ్ముతుండడంతో కొనుగోలుదారులు రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి వస్తున్నది. వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడం, పెద్దపెద్ద వ్యాపార సముదాయాలు, బ్యాంకులు ఎలాంటి పార్కింగ్ స్థలం వదిలిపెట్టకుండా ఏ మాత్రం సెట్‌బ్యాక్ కాకుండా నిర్మాణాలు జరుపుకోవడం కూడా ట్రా'ఫికర్'కు అవకాశం ఏర్పడుతున్నది.



జిల్లా కేంద్రంలో పాత బీట్‌బజార్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

**ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు అవసరం**

జనగామలో సుమారు 30వేల ద్విచక్ర వాహనాలు, 2వేల ఆటోలు, ట్రాలీలు, క్రూజర్లు, కార్లు, మరో 2వేల వరకు లారీలు, బస్సులు, డీసీఎంలు ఇతర భారీ వాహనాలు నిత్యం తిరుగు తున్నాయి. ఇవేకాకుండా హైవే, ప్రధాన రహదారులపై భారీ, మోస్తరు వాహనాల రాకపోకలు సైతం విపరీతంగా పెరిగాయి. చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి రోజుకు కనీసం 5వేల మందికి పైగా ప్రజలు జనగామకు రాకపోకలు సాగిస్తారు. ట్రాఫిక్ కష్టాలు తప్పాలంటే సూర్యాపేట-సిద్దిపేట, హనుమకొండ-హైదరాబాద్ ప్రధాన రోడ్లను మరింత వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది. వరంగల్ పోలీస్ ఈస్ట్‌జోన్ కమిషనరేట్ పరిధిలో ఉన్న జనగామ జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయి సిబ్బందితో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు నియంత్రించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**జనగామ పట్టణ ప్రధాన రహదారులు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతున్నది. ఎక్కడ చూసినా రహదారిని సగం మేర ఆక్రమించి వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు, నాలాను ఆక్రమించుకొని సామగ్రి అమ్మకాలు, షాపుల బోర్డులు, డెమోలు ప్రదర్శించడంతో కొనుగోలుదారులు రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి వస్తున్నది. పెద్ద పెద్ద వ్యాపార సముదాయాలు పార్కింగ్‌కు స్థలాన్ని వదిలి పెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. దీంతో అటు వాహనదారులు, ఇటు ప్రజలకు నిత్యం తిప్పలు తప్పడం లేదు.**

**- జనగామ, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)**


## బిక్కుబిక్కుమంటున్న మన్యం!

- గిరిజన సోదరుల జంట హత్యలతో భయాందోళన
- మావోయిస్ట్ యాక్షన్ టీం సాయంతోనే హత్య జరిగిందని అనుమానం
- టార్గెట్ నేతల గుండెల్లో గుబులు

వాజేడు, నవంబర్ 24 : మండలంలోని పెనుగోలు కాలనీ గ్రామానికి చెందిన పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్, అతడి సోదరుడు ఉయిక అర్జున్‌ను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేసిన నేపథ్యంలో మన్యంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఒకవైపు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ప్రత్యేక పోలీసు బలగాలు జల్లెడ పడుతూ వరుస ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పెనుగోలు కాలనీ గ్రామానికి ఆరుగురు మావోయిస్టులు వచ్చి రెండు గ్రూపులుగా విడిపోయి ఒకేసారి ఇద్దరిని నరికిచంపడం చూస్తుంటే ఇది పక్కాగా రెక్కీ నిర్వహించి, పథకం ప్రకారం చేసినట్లు తెలుస్తున్నది. అంతేకాకుండా బాధత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హత్య చేసిన వారు నల్లరంగు దుస్తులు ధరించి రావడంతో యాక్షన్ టీం సభ్యుల సహకారంతోనే ఇద్దరిని హత్యచేసిట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, మొత్తం ఎంత మంది మావోయిస్టులు వచ్చారో తెలియని పరిస్థితి నెలకొంది. ముగ్గురు, ముగ్గురు చొప్పున ఆరుగురు అక్కడికి వెళ్లినా చుట్టు పక్కల కాపాలాగా మారికొంతమంది ఉన్నారనే సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి. 1987లో బుద్దరాజు సీతాపతిరాజు హత్య, 1991లో వాజేడు పోలీసు స్టేషన్ పేల్చివేసిన ఘటనలు మినహా ఇప్పటి వరకు మండల కేంద్రంలో మావోయిస్టులు ఎలాంటి చర్యలకు పాల్పడిన దాఖలాలు లేవు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ పెనుగోలు గుట్టలపై నుంచి దిగివచ్చి కాలనీలో నివాసం ఉంటున్న ఉయిక రమేశ్, అర్జున్‌ను హతమార్చడంతో మండలకేంద్రంలోని పలువురు టార్గెట్ నేతల్లో కలవరం మొదలైంది. గిరిజన గూడేల్లో అప్పుడప్పుడు మావోయిస్టులు సంచరిస్తుంటారు. అలా వారు వచ్చిన నేపథ్యంలో పోలీసులకు సమచారం తెలిస్తే గూడేల్లో నివసిస్తున్న వారిని పిలిపించుకొని ఆరా తీస్తారు. దీంతో మావోయిస్టులు గూడెం వాసుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టి వారికి అనుమానం కలిగితే హతమారుస్తున్నారు. ఇటు పోలీసులు, అటు మావోయిస్టులు ఇద్దరి వైఖరితో అడకత్తెరలో పోకచెక్కలా అమాయక ఆదివాసీ బిడ్డలు నలిగిపోతున్నారు. ఇటీవల మండలంలో ఒక గ్రామంలో మావోయిస్టులు సమావేశం నిర్వహించారని తెలుసుకున్న పోలీసులు ఆ గ్రామస్తులను పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకుని విచారణ జరిపిన ఘటనలు ఉన్నాయి. ఇద్దరిని హత్యచేసిన సమయంలో మావోయిస్టు వెంకటాపురం, వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట వేర్వేరుగా లేఖలు వదిలివెళ్లారు.

మామూలుగా మావోయిస్టులు ఇలా హత్యలు చేసిన సమయంలో ఒకటే లేక వదిలి వెళ్లేవారు. తొలిసారి వేర్వేరుగా లేఖలు వదలడం చర్చనీయాంశంగా మారింది. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోకి మావోయిస్టులు వచ్చి హత్యచేయడం పోలీసులకు సవాలు విసిరినట్టుగా పలువురు భావిస్తున్నారు. కాగా, ఇద్దరి హత్య నేపథ్యంలో వాజేడు, వెంకటాపురం మండలాల్లోని టార్గెట్ నేతల్లో భయాందోళనలు నెలకొని, వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలుస్తున్నది. ఏదిఏమైనా మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన అర్జున్, రమేశ్ కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి అనాథలుగా మిగిలాయి. ప్రభుత్వం వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు




పర్సనల్ ఫైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్ఠికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అంతకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

### స్కోర్ పెంపునకు మార్గాలు

**సకాలంలో చెల్లింపులు**

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండి బకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

**పరిమితంగా రుణాలు**


రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణ భారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

**అప్పల అన్వేషణ వద్దు**

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

**పొరపాట్లను సరిచేయాలి**

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.




**గ్యారంటీలకు దూరంగా..**

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

**సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు**

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.


## రాబడి

## పిల్లల విద్య కోసం..

**పిల్లల** విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

**ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు**

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.



**హైబ్రిడ్ ఫండ్స్**

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

**విద్యా పథకాలు**

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

**ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

**విద్యా రుణాలు**

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

**బీమా ప్లాన్లు**

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధనసాయం లభిస్తుంది.

## ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

**ఒక** కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.


**ఈటీఎఫ్‌ల ద్వారా..**

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.


**ఈక్విటీ ఎంఎఫ్‌లు**

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

## ఒడిదొడుకుల్లోనే పయనం




దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి. తీవ్రరూపం దాల్చుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో అదానీపై కేసు, క్యూ2 జీడీపీ గణాంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా చెప్పుకోవచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. దీంతో ఆటుపోట్లకు ఆస్కారం ఎక్కువగానే ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,300-24,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




*గమనిక..:* స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.